## సంపాదకీయం

ఆదివారం 27-04-2025

# చిచ్చు పెట్టేందుకే పాశవిక దాడులు!

రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు తరవాత జమ్మూకశ్మీర్ క్రమేపీ తెరిపిన పడుతోంది. ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. కశ్మీర్ లోయలో ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇంతలోనే పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు మళ్లీ పంజా విసిరారు. పర్యాటకులే లక్ష్యంగా పహల్గాంలో భయానక దాడికి తెగబడ్డారు.రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు తరవాత జమ్మూకశ్మీర్ క్రమేపీ తెరిపిన పడుతోంది. ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. కశ్మీర్ లోయలో ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇంతలోనే పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు మళ్లీ పంజా విసిరారు. పర్యాటకులే లక్ష్యంగా పహల్గాంలో భయానక దాడికి తెగబడ్డారు. జమ్మూకశ్మీర్‌లో 370వ అధికరణ రద్దు తరవాత కొత్తగా పుట్టుకొచ్చిన 'ది రెసిస్టెన్స్ ఫోర్స్ (టీఆర్ఎఫ్)' ఉగ్రసంస్థ తానే దాడి జరిపినట్లు ప్రకటించింది. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ అండతో చెలరేగిపోయే లష్కరే తోయిబా విష సర్పానికి పుట్టిన పిల్ల పామే టీఆర్ఎఫ్. 2023 అక్టోబరులో గందేర్బల్‌లోనూ టీఆర్ఎఫ్ ఉగ్రదాడి చేసింది. అందులో ఓ స్థానిక వైద్యుడు, ఆరుగురు కూలీలు మరణించారు. తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటనకు వచ్చినప్పుడే పహల్గాంలో దాడి జరగడం వెనక మతలబు ఏమిటి, టీఆర్ఎఫ్ వ్యూహం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అస్థిరపరిచే కుట్ర

కశ్మీర్‌లో వేర్పాటువాదం, పాకిస్థాన్ అండదండలు కలిసి ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నాయి. ఇలాంటి కల్లోల పరిస్థితులు చాలాకాలంగా ఉన్నా ఇటీవల ఇక్కడి రాజకీయ స్వరూప స్వభావాలు మారిపోవడం తాజా ఉగ్రహింసకు కారణమైంది. 370వ అధికరణ రద్దయిన తరవాత జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా మారింది. ఆ పైన కొద్దికాలంపాటు ఉగ్రవాద ఘటనలు తగ్గుముఖం పట్టాయి. కశ్మీరీ ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం వారి ఆరాటాన్ని 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు తీర్చాయి. ఆ ఎన్నికల్లోనూ, అదే సంవత్సరంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ కశ్మీరీలు పెద్దయెత్తున పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరవాత ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టింది. ఈ శాంతియుత వాతావరణం క్రమంగా పర్యాటకులను కశ్మీర్‌కు ఆకర్షించసాగింది. గడచిన అయిదేళ్లలో ఏడు కోట్లమంది స్వదేశీ, విదేశీ టూరిస్టులు కశ్మీర్‌ను సందర్శించారు. ఎంతోకాలంగా ఉగ్రవాద పడగనీడలో ఉన్న కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగు పడుతున్నాయనడానికి ఇదే నిదర్శనం. కానీ ఇది వేర్పాటువాదులకు, ఉగ్రవాద శక్తులకు, పాకిస్థాన్ ప్రభుత్వానికీ మింగుడు పడలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కశ్మీర్‌లో అభివృద్ధి ప్రాజెక్టుల్లో, ఇతర నిర్మాణ కార్యకలాపాల్లో పాల్గొంటున్న కార్మికులపై మొదట దాడులు జరిగాయి. వారిని వెళ్లగొట్టేస్తే ఎక్కడి పనులు అక్కడ ఆగిపోతాయనేది దుష్టశక్తుల పన్నాగం. తాజాగా కశ్మీర్‌కు విహారయాత్రకు వచ్చిన సాధారణ ప్రజలపై విరుచుకుపడ్డారు. పహల్గాం ఘటనను కేవలం ఇతర దేశాల స్థితిగతుల నుంచి వేరుచేసి చూడలేం. అఫ్గానిస్థాన్‌లో మతరాజ్యాన్ని నెలకొల్పిన తాలిబన్లను, బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోయడం వెనక జమాతే ఇస్లామీ హస్తాన్ని చూసి, భారత్‌లో తీవ్రవాద మత ఛాందస శక్తులకు కొత్త ఊపు వచ్చినట్లయింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల మధ్య మళ్లీ సంబంధాలు ఏర్పడటం వారికి కొత్త ప్రేరణనిచ్చినట్లు తెలుస్తోంది. పహల్గాంలో టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు చెలరేగిపోవడం, మన సరిహద్దుల్లో బంగ్లాదేశీ వత్తాసుతో మత హింస రేగడం చూస్తే భారత్‌ను రాజకీయంగా, సామాజికంగా అస్థిరపరిచే కుట్ర జరుగుతోందని స్పష్టమవుతోంది. భారత్‌లో భయాందోళనలను పెంచి, మతాల మధ్య చిచ్చు పెట్టాలన్నది విద్రోహ శక్తుల పన్నాగం. ఉగ్రవాదుల ఎత్తుగడల్లో వచ్చిన స్పష్టమైన మార్పును కూడా గమనించాలి.

ఐక్యతతోనే భద్రత

గతంలో ప్రధానంగా భద్రతా దళాల మీదనే దాడులు జరిపిన ఉగ్రవాదులు 370 అధికరణ రద్దు తరవాత పౌరులనూ లక్ష్యంగా చేసుకోవడం మొదలుపెట్టారు. క్రమంగా పర్యాటకులపైనా తుపాకీ గురిపెడుతున్నారు. ఈ దుష్ట శక్తులు తమ లక్ష్యాన్ని వేర్పాటువాదం నుంచి భారత్‌లో మత సామరస్యాన్ని దెబ్బతీసే దిశగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. కశ్మీర్‌పైకి ప్రపంచ దృష్టిని ఆకర్షించాలనే లక్ష్యంతోనే ఉగ్రవాదులు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటనకు వచ్చిన సమయంలోనే దాడికి పాల్పడ్డారు. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటికీ సంక్షోభం రేగుతోందనే సందేశాన్ని ఇవ్వాలని యత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉగ్రవాద నిర్మూలనకు అనుసరిస్తున్న వ్యూహాన్ని ఇండియా పునఃసమీక్షించుకోవాలి. కశ్మీర్‌లో గత అయిదేళ్లుగా భద్రతను బలోపేతం చేశారు. అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టారు. ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించారు. ఫలితంగా ఉగ్రవాదులు చాలావరకు తగ్గిపోయాయి. కానీ, ఇప్పుడు ఉగ్రవాదులు తాము అనుకున్న చోట యథేచ్ఛగా దాడి జరపగలిగారంటే, స్థానికంగా కొన్ని అవాంఛనీయ శక్తుల మద్దతు ఉండి ఉండాలి. అలాంటి శక్తుల ఆటకట్టించాలి. అభివృద్ధి కార్యకలాపాలను మరింత ముమ్మరం చేసి కశ్మీరీల ఆదరణ మరింతగా చూరగొనాలి. మరోవైపు యువత తీవ్రవాద భావజాలానికి లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సామాజిక మద్దతును కూడగట్టాలి. ప్రజల మధ్య ఐక్యత దెబ్బతినకుండా కాపాడుకోవాలి.

# పాక్ ఎప్పుడూ పక్కలో బల్లెమే !



న్యూఢిల్లీ,భారత్‌లో ఉగ్రదాడులు జరినప్పుడల్లా పాక్ బుకాయింపులతో కాలక్షేపం చేస్తుంది. తనకు సంబంధం లేదని చెబుతుంది. ఉగ్రవాదులకు మాదేశంలో స్థానం లేదని చెప్పడం కూడా అలవాటు చేసుకుంది. ముంబై ఉగ్రదాడుల సమయంలోనూ ఇదే చెప్పింది. అలాగే అజ్మల్ కసబ్ గురించి వివరాలు చెప్పినా కసబ్ మా దేశస్థుడు కాదని బొంకింది. చివరకు కసబ్ పుట్టుపూర్వోత్తరాలు బయటపడ్డాక కూడా అదే పాట పడింది. ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడితో తమకు సంబంధం లేదని పేర్కొంది. మరి ఢిల్లీలోని పాక్ రాయబాబరి కార్యాలయంలో కేక్ సంబరాలపై ఆ దేశం స్పందించాల్సి ఉంది. ముష్కరులకు పాక్ పూర్తి మద్దతు ఇస్తోందన్న వాదనకు కేక్ వ్యవహారం పక్కా రుజువుగా నిలిచింది. ఇవన్నీ మరచిపోయి బలూచిస్థాన్ ఘటనలను భారత్‌కు అంటగట్టే ప్రయత్నం చేసి చేతులు కాల్చుకుంది. మనం టెర్రరిస్టుల జాబితా సమర్పించినా, వారు పాక్‌లో తిష్టవేసుకుని వున్నా వారిని మాత్రం అప్పగించడం లేదు. హాఫీజ్ సయీద్ లాంటి ఉగ్రవాదులను దాచిపెడుతోంది. వారికి పాలుపోసి పెంచుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే దాడి తరవాత పాక్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఆ దేశ కుత్సితాన్ని బయటపెడుతున్నాయి. దాడులను ఏనాడు పాక్ ఖండించడం లేదు. ఆధారాలు చూపితే చర్యలు తీసుకోవడం లేదు. సరికదా తాజాగా కూడా పాక్ నేతల ప్రకటనలు ఉగ్రవాదులకు ఊతమించ్చేలా, పాక్ అండదండలతో వ్యవహారం నడిచినట్లుగా కనిపిస్తోంది. నిజానికి మత ప్రాతిపదికన భారత్‌ను చీల్చుకుని ఏర్పడ్డ పాక్ పాలకులు ఏనాడూ నిజాయితీగా లేరు. భారత్‌ను వర్గశత్రువుగా చూపించి పబ్బం గడుపుకోవడం, కాశ్మీర్ బూచి చూపి ప్రజలను వశపర్చుకోవడం తప్ప..ఆ దేశం సర్వ నాశనం అయినా వారికి పట్టింపు లేదు. ఇదంతా నాటి భాతర పాలకులు చేసిన దుర్మార్గపు రాజకీయ క్రీనీడ కారణంగా మనకు సంక్రమించిన రావణకాష్టంగా చెప్పుకోవాలి. దీనికి ఎక్కడో ఓ చోట మందు పెట్టాలి. వ్రణం తీవ్రమయితే కాలు తీసేయాల్సిందే. పాక్ కాల్లూచేతులు విరిచేందుకు వెనకాడరాదు. ఇకపోతే పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ టెర్రరిస్టుల విషయంలో దాయాది పాక్ దేశ అసలు రంగు ఇప్పుడు బయటపడింది. బయటకు మాత్రం పహల్గాం టెర్రరిస్ట్ దాడితో మాకు సంబంధం లేదని సుద్దాపూస మాటలు మాట్లాడి.. దాడిని ఖండించింది. కానీ పాక్ ఉప ప్రధాని వ్యాఖ్యలతో వారి నిజస్వరూపం బట్టబయలైంది. 28 మంది అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా ఊచకోత కోసిన నరరూప రాక్షసులను పాక్ డిప్యూటీ పీఎం ఇషాక్ దార్ స్వాతంత్య్ర సమరయోధులతో పోల్చాడు. ఆయన వ్యాఖ్యలతో పాక్ వక్రబుద్ధి ప్రపంచదేశాల ముందు మరోసారి తేటతెల్లమైంది. పహల్గాం ఘటనపై ఇషాక్ దార్ ఇస్లామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ జిల్లాలో దాడులు చేసిన వారు స్వాతంత్య్ర సమరయోధులు అని అభివర్ణించారు. భారత్ సింధూ నది జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంపైన కూడా తనకు తోచిన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌లో 240 మిలియన్ల మందికి సింధు నది నీరు అవసరం. మీరు ఆ ఒప్పందాన్ని ఆపలేరు. ఒకవేళ ఇండస్ ట్రీటీ- రద్దు చేస్తే అది యుద్ధ చర్యకు సమానం అని హెచ్చరించారు.ఆ దేశం కూడా అదే విధమైన ప్రతిచర్యను ఎదుర్కొంటుందని అన్నారు. 28 మందిని మానవత్వం లేకుండా మట్టుబెట్టిన ఉగ్రమూకలను పాక్ ప్రధాని ఏకంగా స్వాతంత్ర సమరయోధులతో పోల్చడంపై భారత ప్రజలు భగ్గుమంటున్నారు. ఇదే పాక్ అసలైన బుద్ది అని విమర్శిస్తు న్నారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది అనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. పర్యాటకులను మతం ఆధారంగా పరిశీలించి, అడిగి మరీ ఉగ్రమూకలు విచక్షణరహితంగా కాల్పులు జరిపాయి.ముష్కరుల పాశవిక దాడిలో 26మంది అమాయక ప్రజలు మృతి చెందగా.. మరికొందరు పర్యాటకులు బుల్లెట్ గాయాలకు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పహల్గాంలో దాడికి పాల్పడిన ముష్కరుల కోసం భారత దళాలు జమ్మూ కాశ్మీర్‌ను అణువణువునా శోధిస్తున్నారు. అందరూ నిరాయుధులు.. సామాన్యులు..తమను విడిచిపెట్టాలని బతిమలాడినా ఉగ్రమూకలు పట్టించుకో లేదు. తలకు తూపాకీ గురిపెట్టి అత్యంత కర్కశంగా వారిని కడతేర్చారంటే ఎంతటి మత దురహంకారులో అర్థం చేసుకోవాలి. . కశ్మీర్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఈ దాడి వెనక లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. సయీద్‌తో పాటు అతడి ముఖ్య అనుచరుడు సైఫుల్లా..ఉగ్రమూకలను అమాయకుల మీద ఊసిగొల్పారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఎల్ఈటీకి అనుబంధంగా ఉన్న కరుడుగట్టిక ఉగ్రవాదుల బృందం బైసరన్‌లో నిర్దాక్షిణ్యంగా 26 మంది అమాయకులను మట్టుపెట్టింది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఈ బృందంలో ప్రధానంగా విదేశీ ఉగ్రవాదులు ఉంటారు. వీరికి స్థానిక మిలిటెంట్లు తోపాటు కశ్మీర్‌లో మద్దతుదారులు మరికొం దరు పని చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. పాక్ ప్రభుత్వ మద్దతుతో హాఫీజ్ సయీద్, అతడి ముఖ్య అనుచరులు ఈ ఉగ్రమూకలకు నేరుగా సహాయపడి ఉండొచ్చని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఎప్పుడైనా టెర్రరిస్టులు పాక్ నుంచే వస్తుంటారు. పాక్ నుంచే శిక్షణ పొందుతారు. పాక్ వారిని ఉసిగొల్పుతుంది. కనుక మనం తీసుకునే చర్యలు ప్రపంచం కూడా హర్షించేలా.. పాక్ నడ్డివిరిచేలా ఉండాలి. పాక్ ఇక జన్మలో కోలుకోకుండా చేయాలి. దెబ్బకొడితే జీవితాతంతం మరచిపోకుండా చేయాలి. అప్పుడే మనకు ఈ ఉగ్రదాడుల బెడద ఉండదు. అయితే ఎంతసేపు ఎవరు దాడిచేస్తారో అన్న అప్రమత్తతో పాటు ఉగ్రవాదుల ఏరివేతలో ఇజ్రాయిల్ సహకారం తీసుకుంటే మంచిది.

# అమెరికాలోనూ కౌలు రైతులకు సమస్యలే



వాషింగ్టన్,భారత దేశంలోను, అమెరికాలోను కౌలు రైతుల చట్టాలు, సమస్యలు, భూకామందుల దోపిడీ దాదాపు ఒకే విధంగా ఉన్నాయి. అమెరికాలోని వ్యవసాయ కుటుంబాల మొత్తం జనాభా 2 శాతం మాత్రం ఉంటే, భారత దేశంలో 68% ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న వ్యవసాయ వ్యత్యాసం ఇదే. ఉద్యమాలు లేదా వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యల ఫలితంగా పాలక ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు, కౌలుదారీ చట్టాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు కౌలుదారీ చట్టాలు చేశాయి. 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1956లో చేసిన ఆంధ్రా కౌలుదారీ చట్టం, 2011లో అధీకృత కౌలుదారీ చట్టం, 2019లో వైసిపి ప్రభుత్వం తెచ్చిన పంట సాగుదార్ల రక్షణ చట్టం మొదలైనవి రైతాంగ ఉద్యమాల ఫలితంగా వచ్చినవే. ఈ అన్ని చట్టాలలోనూ కౌలు ఒప్పందం ఉండాలని, సంస్థాగత రుణాలు, పంట నష్టపరిహారాలు పొందటానికి భూయజమాని అనుమతి ఉండాలని పేర్కొన్నాయి. ఆ విధంగా కౌలుదారీ చట్టాలు అలంకారప్రాయంగా మారాయి. అమెరికాలోనూ కౌలు చట్టాలు ఈ విధంగానే ఉన్నాయి.అమెరికా వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 2017లో 90 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంటే, 2024 నాటికి 87 కోట్ల, 60 లక్షలకు తగ్గిందని, తగ్గుదల 3 శాతమని ఎకనమిక్స్ రీసెర్చ్ సర్వీసు ద్వారా తెలియచేయబడింది. 2017 వ్యవసాయ కమతాలు 20 లక్షల 40 వేలు ఉండగా, 2022 నాటికి 20 లక్షల 3 వేలకు తగ్గాయి. 2000 సంవత్సరంలో అమెరికాలో సగటు కమతం భూమి 442 ఎకరాలు కాగా, 2022 నాటికి 441 ఎకరాలకు పెరిగింది. అమెరికాలో 50 ఎకరాల కన్నా తక్కువ భూమి కలిగిన చిన్నకమతాలు 6 లక్షల, 71 వేలు ఉన్నాయి. ఈ కమతాలు సంఖ్య తగ్గటం, మధ్యస్థ భూకమతాలు కూడా తగ్గటం వలన 2 వేల ఎకరాల కన్నా ఎక్కువ భూ విస్తీర్ణం కలిగిన కమతాలు పెరిగి సగటు కమతం భూ విస్తీర్ణం పెరిగింది. సంవత్సరానికి 3 లక్షల 50 వేల డాలర్ల కన్నా తక్కువ ఆదాయం వచ్చిన కమతాలను చిన్న కమతాలు అంటారు. ఇవి మొత్తం కమతాల్లో 86% గా (10 లక్షల 72 వేలు) ఉన్నాయి. సంవత్సరానికి 10 లక్షల డాలర్ల కన్నా ఎక్కువ ఆదాయం పొందే వాటిని పెద్ద కమతాలు అంటారు. మొత్తం కమతాల్లో ఇవి 4%గా ఉన్నాయి. వీటి మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో 48 శాతంగా ఉంది. అమెరికాలో వ్యవసాయ భూమి ఎక్కువ భాగం (సుమారు 60 లేక 70%) వ్యక్తిగత లేదా కుటుంబ కమతాలుగా ఉంది. 2014 లో ఒక సర్వే ప్రకారం 96% కమతాలు కుటుంబ యాజమాన్యంలో ఉన్నాయి. ఇవి 52 కోట్ల, 80 లక్షల ఎకరాలు కలిగి ఉన్నాయి.అమెరికాలో కౌలు సేద్యం కీలక పాత్ర పోషిస్తున్నది. మొత్తం రైతుల్లో 28% అంటే 5 లక్షల, 70 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. సేద్యంలో, ఉత్పత్తిలో కౌలు రైతులు ముఖ్య భూమిక వహిస్తున్నారు. మొత్తం వ్యవసాయ భూమిలో 40 శాతం (35 కోట్ల, 30 లక్షల ఎకరాలు) కౌలు రైతులు సేద్యం చేస్తున్నారు. ఇందులో 80 శాతం ఎటువంటి వ్యవసాయం చేయని భూకామందుల భూములే ఉన్నాయి. భారత దేశంలో లాగానే అమెరికాలో కూడా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, పంట రుణాలు కౌలు రైతులకు అందటం లేదు. కౌలు ఒప్పందం కూడా సంవత్సరం లేదా అంతకన్నా తక్కువగా ఉంది. చాలా కౌలు ఒప్పందాలు ముఖ్యంగా చిన్న రైతులు చేసుకునే ఒప్పందాలు భారత దేశంలో లాగానే నోటి మాటపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల చట్టపరమైన కౌలు గుర్తింపు ఉండదు. అమెరికా వ్యవసాయ శాఖ కార్యక్రమాల్లో (సబ్సిడీలు, రుణాలు) దరఖాస్తు చేసుకునేందుకు కౌలు రైతులు ఫార్మర్ ఆపరేటింగ్ ప్లాన్ సమర్పించాలి. ఇందుకు కౌలు ఒప్పందం లేదా భూమి యజమాని నుండి లిఖితపూర్వక అనుమతి అవసరం. ఫలితంగా చాలా మంది కౌలురైతులు సబ్సిడీలు, రుణాలు పొందలేకపోతున్నారు. 2022లో అమెరికా ప్రభుత్వం రైతులకు 15.6 బిలియన్ డాలర్ల సబ్సిడీలను ప్రకటించింది. 1995 నుండి 2021 వరకు 478 బిలియన్ డాలర్ల సబ్సిడీలు పంపిణీ చేయబడ్డాయి. ఇడబ్లుజి (ఎన్విరాన్‌మెంట్ వర్కింగ్ గ్రూపు) నివేదిక ప్రకారం అందులో పైస్థాయిలో ఉన్న (పెద్ద, ధనిక కమతాలు) భూ యజమానులే 79% (సుమారు 377 బిలియన్ డాలర్లు) సబ్సిడీల రూపంలో పొందారు. అతి చిన్న కమతాలు కలిగిన 80% రైతులు కేవలం 9% సబ్సిడీలు మాత్రమే అందాయి.కౌలు రైతులు సబ్సిడీలకు అర్హులైనా చాలా సందర్భాల్లో భూయజమానులే వాటిని పొందారు. సబ్సిడీలు పొందటానికి రైతు సంవత్సర ఆదాయం 9 లక్షల డాలర్ల కన్నా తక్కువ ఉండాలి. ఈ నిబంధన ప్రకారం చిన్న రైతులకే ఎక్కువగా సబ్సిడీలు అందాలి. లిఖితపూర్వక కౌలు ఒప్పందం లేకపోవటం, భూయజమాని అనుమతి పత్రం లేకపోవటంతో కౌలు రైతులు సబ్సిడీలకు దూరంగా ఉన్నారు. అమెరికాలో నేడు కౌలు రైతులు సంక్షోభంలో ఉన్నారు. కౌలు రైతులకు సొంత భూమి లేకపోవటం, భూమిని అధిక రేటుకు కౌలుకు తీసుకోవటం, పంట ఖర్చులు పెరగటం, పండించిన పంటలకు తగిన ధరలు లభించకపోవటం, వాతావరణ మార్పులు కౌలు సేద్యం పై ప్రతికూల ప్రభావం చూపటం, సబ్సిడీలు, రుణాలు అందకపోవటం, దేశంలో ఆర్థిక మాంద్యం ఎర్పడినప్పుడు కౌలు రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపటం కౌలు సేద్య సంక్షోభానికి కారణంగా ఉంది. ఫలితంగా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి.అమెరికాలోని సెంట్రల్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రీవెన్సన్ (సిడిసి) ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం వ్యవసాయం, అటవీ, మత్స్యరంగాల్లో పని చేసే వారిలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్ష మందిలో 36 గా ఉంది. ఇది సాధారణ జనాభా మరణాల రేటు (లక్షకు 14.4) కన్నా చాలా ఎక్కువగా ఉంది. 2020లో యూనివర్శిటీ ఆఫ్ ఐవోవా అధ్యయనం ప్రకారం రైతులలో వ్యవసాయ సంబంధిత వృత్తుల్లో ఉన్న వారిలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్షకు 43.7గా ఉంది. కౌలు సేద్యపు సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, కౌలురైతుల ఆందోళన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాన్ని తయారు చేస్తున్నది. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు, భూకామందులతో చేసుకునే ఒప్పందాల్లో సబ్సిడీలు, బీమా ప్రయోజనాలు పొందే హక్కును చేకూర్చేలా చేసే మార్గదర్శకాలు, ప్రభుత్వ చేసే సహాయాన్ని యజమానులు అడ్డుకోకుండా చేస్తుందని, నేరుగా కౌలురైతులు సహాయం పొందే అవకాశం కల్పిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇది ఎంతవరకు అమలు జరుగుతుంది అన్నదాని కోసం అమెరికా కౌలురైతులు ఎదురు చూడాల్సిందే. ఎందుకంటే అమెరికా ప్రభుత్వం పెద్ద భూఎస్టేట్ దారుల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడేది కావటమే. అందుకు భిన్నంగా వ్యవసాయ చట్టం ఉండదు. భూమిలేని కౌలురైతులకు అవసరం మేరకు భూపంపిణీ చేయాలి. సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, రుణాలు కౌలు రైతులకే ఎక్కువ అందాలి. పంటలకు తగిన ధరలు లభించాలి. లిఖితపూర్వక కౌలు ఒప్పందం జరగాలి.

# న్యూయార్క్‌టైమ్స్ పైత్యం

వాషింగ్టన్, పహల్గాం ఉగ్రదాడిపై అమెరికా పత్రిక న్యూయార్క్‌టైమ్స్ కవరేజీని అక్కడి ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది. 'హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీ-మెజార్టీ' ఎక్స్ హ్యాండిల్‌లో ఈ మేరకు పోస్టు చేసింది. వాస్తవానికి ఆ పత్రిక ప్రచురించిన పహల్గాం ఘటన వార్తలో.. దాడి చేసిన వారిని 'టెర్రరిస్టు'లుగా కాకుండా తప్పుదోవ పట్టించేలా 'మిలిటెంట్లు'గా చిత్రీకరిస్తూ శీర్షికను పెట్టింది. అంతేకాదు వార్తలో కూడా మిలి-టె-ంట్లు-, గన్‌మెన్‌లు అని రాసుకొచ్చింది. అలాగే ఇది ఓ సాధారణ కాల్పుల ఘటనలా రాసింది. ఈ వార్త క్లిప్పింగ్‌ను ఎర్రటి అక్షరాలతో సరిచేసిన 'హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీ- మెజార్టీ' ఎక్స్‌లో పోస్టు చేసింది. హేయ్ న్యూయార్క్‌టైమ్స్. నీకోసం ఈ తప్పు మేము సరిచేశాము. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది 'ఉగ్రదాడి'. ఏది ఏమైనప్పటికీ భారత్ లేదా ఇజ్రాయెల్‌లో ఉగ్రవాదం విషయానికి వచ్చేసరికి న్యూయార్క్‌టైమ్స్ నిజాలను మాయం చేస్తుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇదిలావుంటేభారత్‌పై అమెరికా విదేశాంగశాఖను ప్రశ్నించి.. ఏదైనా వ్యాఖ్యలు చేయిద్దామని ప్రయత్నించిన పాక్ జర్నలిస్టుకు భంగపాటు ఎదురైంది. దీనికితోడు పహల్గాం దాడి విషయంలో వాషింగ్టన్ న్యూఢిల్లీకి ఎంత అండగా ఉందో చెప్పే ఘటన మరొకటి చోటు-చేసుకొంది. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొనడంపై అమెరికా విదేశాంగ ప్రతినిధి టామ్మీ బ్రూస్‌ను ఓ పాక్ జర్నలిస్టు అడిగాడు. దీనికి ఆమె స్పందిస్తూ.. నేను దానిపై ఎటువంటి వ్యాఖ్యలు చేయను. మనం ఇంకో సబ్జెక్టు మాట్లాడుకుందాం. ఇప్పటికే అధ్యక్షుడు ట్రంప్, మంత్రి మార్కో రూబియో మాట్లాడారు. అందుకే ఆ విషయంపై నేను మాట్లాడను. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తాను. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తాను. ఈ హీనమైన దాడికి పాల్పడిన వారికి శిక్ష పడాలని కోరుకుంటాను అని పేర్కొన్నారు. ఇక ఈ దాడి వెనక పాక్ హస్తం ఉందని భావిస్తున్నారా.. ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నిస్తారా అన్న ప్రశ్నలకు కూడా ఆమె స్పందించారు. పరిస్థితులు వేగంగా మారుతున్నట్లు మనం చూస్తున్నాం. వాటిని చాలా జాగ్రత్తగా గమనిస్తున్నాం. జమ్మూకశ్మీర్‌పై ఎటువంటి పొజిషన్ తీసుకోలేదని వ్యాఖ్యానించారు. ఈ దాడిపై తన సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ తొలిరోజే పోస్టు చేశారు. కశ్మీర్ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు అమెరికా మద్దతుగా నిలుస్తుంది. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. ప్రధాని మోదీ, భారత ప్రజలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు.

# ఇక అతి భీకరమే !

న్యూఢిల్లీ,భారత్ ఇక అతి భీకరమైన యుద్ధానికి తెర తీసే సూచనలు కనిపిస్తున్నాయి. గట్టిగా భారతీయులు అంతా కలిసి గాలి వదిలితే అదే సుడిగాలిగా సునామీగా మారి పాకిస్థాన్ అందులో కొట్టుకుని పోతుంది అని అంటూంటారు. ఇపుడు అలాంటి పరిస్థితినే పాక్ చూడబోతోంది అని అంటున్నారు.ఏ విధంగా చూసినా భారత్ తో సమ ఉజ్జీ కానీ పాక్ కి శాశ్వతమైన గుణపాఠం చెప్పడానికి భారత్ చూస్తోంది అని అంటున్నారు. నిన్నా అమిత్ షా రాజ్ నాథ్ సింగ్ ఉగ్రవాదుల భరతం పడతాం అని చేసిన వ్యాఖ్యలకు మించి ఈ రోజున ప్రధాని నరేంద్ర మోడీ బీహార్ లో మాట్లాడుతూ వెంటాడి వేటాడి భారత్ ఏంటో ఉగ్ర మూకలకు చూపిస్తామని గర్జించిన తీరు చూసిన వారికి కేంద్ర ప్రభుత్వం ఎంత సీరియస్ గా ఉందో అర్థం అవుతోంది.ఈ పరిణామాల నేపథ్యంలో భారత రాష్ట్రపతి సర్వ సైన్య అధ్యక్షురాలు అయిన ద్రౌపది ముర్ము వద్దకు కేంద్ర హొంమంత్రి అమిత్ షా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ వెళ్ళి తాజా పరిణామాలు కాశ్మీర్ ఉగ్ర దాడి గురించి ఆమెకు వివరించారు అని చెబుతున్నారు. అంతే కాదు రాష్ట్రపతి ముందు రెడ్ ఫైల్ ని ఉంచారని అంటున్నారు.మరి ఆ రెడ్ ఫైల్ లో ఏమి ఉందో తెలియదు కానీ పాకిస్థాన్ మీద భయంకరమైన ప్రతీకారానికి భారత్ సిద్ధమవుతోంది అని సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇంకో వైపు చూస్తే వివిధ దేశాలకు చెందిన రాయబారులకు భారత్ ఉగ్ర దాడి గురించి వివరించింది. భరత విదేశాంగ శాఖ అధికారులు రష్యా జర్మనీ, జపాన్, పోలెండ్, యూకే, తదితర ఇరవైకి పైగా దేశాలకు చెందిన రాయబారులతో ఈ ఉగ్రదాడి వెనక ఎవరు ఉన్నారో కూడా పూసగుచ్చినట్లుగా వివరించారు అని అంటున్నారు.ఇక ఈ ఉగ్ర దాడికి పాల్పడింది తామే అని లష్కరే తోయిబా అనుబంధ ఉగ్ర సంస్థ ఇప్పటికే ప్రకటించింది. దీంతో పాకిస్థాన్ ప్రమేయం కూడా ఈ దాడి వెనక ఉందని స్పష్టం అయింది అని అంటున్నారు. పాక్ జోక్యం పూర్తిగా ఉంది అన్న ఆధారాలు కూడా భారత ఇంటలిజెన్స్ వర్గాలు సేకరించాయని చెబుతున్నారు. వాటిని అన్నింటినీ కూడా భారత్ విదేశీ రాయబారులకు పూర్తివా వివరించిందని చెబుతున్నారు.రేపటి రోజున భారత్ పాకిస్థాన్ మీద ఏ రకమైన కఠిన చర్యలు చేపట్టినా అంతర్జాతీయ సమాజం మద్దతు కూడగట్టేందుకు ఈ విధంగా భారత్ వ్యవహరిస్తోంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే పాకిస్థాన్ సైతం యుద్ధ సన్నాహాలలో ఉంది. భారత్ మూడ్ ని గమనిస్తోంది. దానికి అనుగుణంగా వేగంగా అడుగులు వేస్తోంది.ఇక రెండు దేశాలూ అణు సామర్థం కలిగినవే. యుద్ధమంటూ వస్తే అది సంప్రదాయ యుద్ధంగానే ఉండదు అని పాక్ తన దూకుడుతో అణు యుద్ధం దాకా పరిస్థితిని తెస్తుందా అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా భారత్ దే ఈ యుద్ధంలో పై చేయి అవుతుందని అంటున్నారు. మొత్తానికి చూస్తే భారత్ పట్టుదల చూస్తూంటే పాక్ పీచమణచడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఉపప్రధాని ఇషాక్‌దార్ వ్యాఖ్యలు అమానుషం

లాహోర్, జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఘటనపై పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు విమర్శలకు దారితీశాయి. ఉగ్రవాదులను 'స్వాతంత్య్ర సమరయోధులు' అంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారు. దీనిపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పటికే పాక్ ప్రధాని మౌనంగా ఉండటంపై ప్రశ్నల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే.పాకిస్థాన్ ఉప ప్రధాని ఉగ్రవాదులను ఫ్రీడమ్ ఫైటర్స్ అంటూ సంబోధించారు. ఇది అవమానకరమే కాకుండా.. ఉగ్రవాదానికి మేం మద్దతిస్తున్నాం, ప్రోత్సహిస్తున్నామంటూ బహిరంగంగా అంగీకరించినట్లు-అయిందని డానిష్ పోస్టు పెట్టాడు. ఇప్పటికే పాకిస్థాన్ ఉగ్రవాదులను కాపాడటంతోపాటు ఆశ్రయం కల్పించడంపై డానిష్ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తూనే ఉన్నాడు. తాను పాక్ లేదా ఇక్కడి ప్రజలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టంచేశాడు. నేను ఇక్కడ పాకిస్థాన్ లేదా దేశ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. ఉగ్రవాదం చేతిలో పాక్ తీవ్రంగా బాధపడుతోంది. శాంతికోసం నిలబడే నాయకత్వం అవసరం ఉంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేవారు కాదు. నేను గర్వంగా పాక్ క్రికెట్ జెర్సీని ధరించా. మైదానంలో నా చెమటను చిందించా. చివరికి నన్ను ట్రీట్ చేసిన విధానం కూడా పహల్గాం బాధితులకు భిన్నంగా లేదు. హిందువుగా ఉన్నందుకే లక్ష్యంగా మారా. ఉగ్రవాదాన్ని సమర్థించేవారు సిగ్గుపడాలి. హంతకులను రక్షించేవారు సిగ్గుపడాలి. నేనెప్పుడైనా మానవత్వం, వాస్తవం వైపే నిలబడతా. పాకిస్థాన్ ప్రజలు కూడా ఇలానే ఉంటారని భావిస్తున్నా. వారిని తప్పుదోవ పట్టించొద్దని సుదీర్ఘమైన పోస్టు పెట్టాడు. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ స్పందించకపోవడంపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా విమర్శలు గుప్పించాడు.

## ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

సిద్దిపేట,జిల్లావ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పలుచోట్ల కేంద్రాలను ప్రారంభించారు. కాగా ఇప్పుడిప్పుడే కోతలు మొదలై ధాన్యం నిల్వలు కల్లాలకు చేరుకుంటున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిరానున్న నేపథ్యంలో సంబంధిత యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు సైతం చేపడుతోంది. ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లో ఇప్పటి వరకు గోనెసంచుల పూర్తిస్థాయిలో చేరుకోలేదు. దీంతో పాటు ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాగానే ఈ కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలో భద్రపర్చేందుకు కోసం తగిన సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం ఇబ్బందులకు కారణం కానుందంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం వేర్ హౌజింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని గోదాములు మొన్నటి ఖరీఫ్ పంటలతో నిండిపోయి ఉన్నాయి. అయితే ప్రస్తుతం కొనుగోలు చేసే ధాన్యాన్ని నిల్వచేయడం కష్టతరం కాబోతుందంటున్నారు. ప్రస్తుతం గోదాముల కొరత, గోనెసంచుల కొరత వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందంటున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయశాఖతో పాటు మార్కెటింగ్‌శాఖ, రెవెన్యూ, పోలీసుశాఖలు సమిష్టిగా ధాన్యం కొనుగోళ్ల వ్యవహారాన్ని పరిశీలించ నున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. కాగా ధాన్యం కొనుగోలు వ్యవహారంతో గోనెసంచులు, గోదాముల కొరత కొనుగోలు ప్రక్రియపై ప్రభావం చూపే ప్రభావం ఉండదంటున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలు కురుస్తుండడం రైతాంగాన్ని బెంబేలెత్తిస్తోంది. ఒక రోజు ఎండ తీవ్రత పెరగడం, మరో రోజు వర్షం కురియడం, వాతావరణం చల్లబడడం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టే విషయంలో ఆందోళనకు లోనవుతు న్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏ నిమిషం ఏం జరుగుతుందోనంటూ భయపడుతున్నారు.. త్వరగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అవసరమైన కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని మంత్రి పొన్నం తెలిపారు.. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. చివరి గింజ కొనే వరకు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

## స్థూలకాయం కూడా జబ్బే.. దాంతో గుండెపోటుకు అవకాశం

న్యూఢిల్లీ,స్థూలకాయుల్లోనే గుండెపోట్లు అధికమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనిని గుర్తించి సరిదిద్దుకోవాలని సూచిస్తున్నారు. ముందుగా స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్లు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి. శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబ కాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పని తీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లువ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే శరీరం అదుపులో పెట్టుకోగలమని అన్నారు.

## విభజన హామీలను మోడీ ముందు పెట్టండి

కర్నూలు,ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు... పదేళ్లు ఇవ్వాలన్న బిజెపి మోసం చేసిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ గుర్తు చేశారు. మరోమారు అమరావతికి వస్తున్న మోడీని విభజన హామీలపై నిలదీయాల్సి ఉందన్నారు. అలాగే ప్రత్యేక హోదా సంగతి తేల్చాలన్నారు. ఇవన్నీ మరచిపోయి కేవలం మోడీ భజనలో మునిగి పోవద్దని కూటమి నేతలకు సూచించారు. ఎన్నికల్లో బిజెపి ఇచ్చిన హామీలపై నిలదీయాలన్నారు. ఈ హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి కుళ్లు రాజకీయాలను నిలదీయాలన్నారు. దేశంలోనే రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని, ఇటువంటి ప్రాంతానికి బుందేల్‌ఖండ్, కెబికె తరహా ప్యాకేజీలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి పోరాటాల ద్వారా విభజన చట్టంలోని హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. విభజన హామీలు, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్రాన్ని నిలదీయలేక పోతున్నారని మండిపడ్డారు. ఆంధ్రాకు జరిగిన అన్యాయం దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. అడగాల్సిన వారు అడగరని, ఇవ్వాల్సిన వారు ఇవ్వడం లేదని విమర్శించారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రధాని మోడీ ముందు ఈ సమస్యలను ప్రస్తావించి ప్రజల ఆకాంక్షలను తెలపాలని అన్నారు.వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసి ప్రధానమంత్రి వద్దకు, కేంద్ర హోం శాఖ మంత్రి వద్దకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ విషయం లో చిత్తశుద్ధిని ప్రదర్శించలేదన్నారు. తనకు 25 మంది ఎంపిలను ఇస్తే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హక్కులన్నింటినీ సాధిస్తామని ఎన్నికల ముందు జగన్ చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇదే విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

# భూదాన్ భూముల్లో ఐఏఎస్,ఐపీఎస్‌లా!

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో సర్వే నం. 181, 182, 194, 195లో భూదాన్ భూములు అన్యాక్రాంతం కావడంలో పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లు సహా కొందరు ఉన్నతాధికారుల పాత్ర ఉందన్న పిటిషన్‌ను విచారించిన హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టింది. ప్రాథమికంగా రికార్డులను పరిశీలిస్తే నాగారం గ్రామంలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని పేర్కొంది. భూదాన్ భూముల అన్యాక్రాంతంలో ఉన్నతాధికారుల పాత్ర ఉందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రజా ఆస్తి పరిరక్షణ చర్యల్లో భాగంగా వాటిని నిషేధిత జాబితాలో చేర్చాలని జిల్లా కలెక్టర్, మహేశ్వరం, ఎల్బీనగర్ సబ్‌రిజిస్ట్రార్లకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు వీలుగా ఏ ఒక లావాదేవీని జరపడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఈ భూబాగోతంలో ఉన్నతాధికారుల పాత్రపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించరాదని రిజిస్ట్రీని ఆదేశించింది. కీలక నిర్ణయాలు తీసుకొనే అధికారులపైనే తీవ్ర అభియోగాలు ఉన్నందున ఈ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి ఆసారం ఇవ్వబోమని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రయోజనాల పరిరక్షణ చర్యల్లో భాగంగా ఆ అధికారులకు అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా మధ్యంతర ఉత్తర్వులను జారీచేస్తున్నట్టు ప్రకటించింది. భూదాన్, గ్రామదాన చట్టం ప్రకారం దాతలు ఇచ్చిన భూదాన్ భూములను పేదలకు వ్యవసాయం, ఇండ్ల నిర్మాణాలకు కేటాయించాల్సి ఉందని గుర్తుచేసింది. ఈ భూములు వారసత్వంగా కొనసాగించ వచ్చని పేర్కొంది. అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాసర్‌రెడ్డి గురువారం కీలక ఉత్తర్వులు జారీచేశారు.

ఫిర్యాదులపై చర్యలు శూన్యం

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గత ఫిబ్రవరి, మార్చిల్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటూ స్థానికుడు బిడ్డ మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీలతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ వాదనలు వినిపిస్తూ సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పాత్ర ఉన్నందున సీబీఐ, ఈడీ దర్యాప్తునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. భూదాన్ చట్టం, తెలంగాణ భూదాన్, గ్రామదాన నిబంధనలు-1965కు విరుద్ధంగా సొంత పేర్లతోపాటు కుటుంబసభ్యుల పేర్లతో కొనుగోలు చేశారని తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు, ఈ ఏడాది మార్చి 8న సీఎంవో కార్యాలయంతోపాటు హెూంశాఖ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రాలు పంపినప్పటికీ చర్యలు శూన్యమని తెలిపారు. ఏపీ, తెలంగాణల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పాత్ర ఉన్నందున కేంద్రానికి చెందిన డీవోపీటీ, హెూంశాఖలకు జనవరి 13న ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు. పోలీసులు, అధికారులు ఫోర్జరీ పత్రాలతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని తెలిపారు. బినామీ లావాదేవీలు నిర్వహించడంతో చట్టవిరుద్ధంగా భూదాన్ భూములను అక్రమంగా బదలాయింపులు చేశారని ఆరోపించారు. భూదాన్ భూముల బదలాయింపు, అన్యాక్రాంతంపై నిషేధం ఉన్నప్పటికీ అధికారులు రికార్డులను తారుమారు చేశారని అన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేర్లు చేర్పించుకుని పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా పొందారని తెలిపారు. అక్రమాలను బయటపెట్టిన పిటిషనర్లకు హాని తలపెట్టే అవకాశం ఉన్నదని, రక్షణ కల్పించాలని కోరారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లకు నోటీసులు

ప్రతివాదులైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, భూదాన్



యజ్ఞ బోర్డు, సీసీఎల్ఏతోపాటు సీబీఐ, ఈడీలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వ్యక్తిగత హెూదాలో ప్రతివాదులుగా ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వాళ్ల కుటుంబసభ్యులకు, ఇతర అధికారులకు కూడా నోటీసులు జారీచేసింది.ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు నవీన్ మిట్టల్, జ్ఞానముద్ర (సోమేశ్‌కుమార్ భార్య), పావనీరావు (రిటైర్డ్ ఐపీఎస్ ప్రభాకర్‌రావు భార్య), ఐశ్వర్యరాజు (ఈ వికాస్‌రాజు భార్య), వసుంధర సిన్హా, ఏకే మొహంతి, ఓం అనిరుధ్ (ఐపీఎస్ అధికారి రాచకొండ కమిషనర్ కొడుకు), నందిన్‌మాన్ (ఐపీఎస్ విక్రమ్‌సింగ్‌మాన్ భార్య), రీటా సుల్తానియా (ఐఏఎస్ సందీప్‌సుల్తానియా భార్య), రాధిక (ఐపీఎస్ కమలాసన్‌రెడ్డి భార్య), నితేశ్‌రెడ్డి (మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కొడుకు), ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్రా, రవి గుప్తా, తరుణ్‌జోషి, తోట శ్రీనివాసరావు, సుబ్బారాయుడు, రాహుల్ హెగ్డే, రేఖా షరాఫ్ (ఐపీఎస్ ఉమేశ్‌షరాఫ్ భార్య), రేణుగోయల్ (డీజీపీ జితేందర్ భార్య), దివ్యశ్రీ (ఐఏఎస్ ఆంజనేయులు భార్య), హేమలత (ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి భార్య), ఇందూరావు కే (ఐపీఎస్ లక్ష్మీనారాయణ భార్య), సవ్యసాచి ప్రతాప్‌సింగ్ (ఐపీఎస్ గోవింద్‌సింగ్ కొడుకు), రాహుల్ (రిటైర్డ్ ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కొడుకు), వరుణ్ (ఐపీఎస్ విశ్వప్రసాద్ కొడుకు), రిటైర్డ్ డీజీపీ అనురాగ్ శర్మ, ఐఏఎస్‌లు అమోయ్‌కుమార్, రాజశ్రీ హర్ష, అజయ్‌జైన్, ఇతర అధికారులు, ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వారందరికీ అందజేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు.

నిషేధిత జాబితాలోకి భూములు

వాదనల తర్వాత హైకోర్టు.. నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఉన్నతాధికారులపై తీవ్రమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారి ప్రయోజనాల రక్షణల్లో అధికార దుర్వినియోగానికి అవకాశం ఉంటుందని సందేహం వ్యక్తంచేసింది. కాబట్టి తమకున్న విచక్షణాధికారాలను వినియోగించి ఈ పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు సర్వే నం. 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిలా కలెక్టర్, సబ్‌రిజిస్ట్రార్‌లకు ఉత్తర్వులు జారీచేస్తున్నట్టు ప్రకటించింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసేదాకా ఈ భూముల్లో ఎలాంటి మార్పులు చేర్పులు చేయరాదని షరతు విధించింది.భూదాతల అభీష్టానికి అనుగుణంగా అవి వ్యవసాయం చేసుకునేందుకు మాత్రమే వినియోగించేందుకు పేదలకు కేటాయించవచ్చని పేర్కొంది. లేనిపక్షంలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు ప్రజాఅవసరాలకు, బలహీనవర్గాల ఇండ్ల నిర్మాణానికి వాడుకోవచ్చునని తెలిపింది. భూదాన్ నిబంధన 3 ప్రకారం కేటాయింపులు వారసత్వంగా ఇవ్వవచ్చనని కూడా పేర్కొంది. అంతేగాని అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని స్పష్టంచేసింది. తదుపరి విచారణను జూన్ ఒకటికి వాయిదా వేసింది.

# ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి లాంటిదే

వాషింగ్టన్, పహల్గామ్ ఉగ్ర దాడిని అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన మారణహోమంతో అమెరికా పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ పోల్చారు. ఆనాడు ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకుందని.. అలాగే పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకోవాలని సూచించారు. ఐఎస్ఐతో సహా దాని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయాలని సూచించారు. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ రెచ్చగొట్టడం వల్లే పహల్గామ్ ఉగ్ర దాడి జరిగిందని తెలిపారు. దివంగత ఒసామా బిన్ లాడెన్‌కు అసిమ్ మునీర్‌కు పెద్ద తేడా లేదన్నారు. లాడెన్ గృహలో దాక్కుంటే.. అసిమ్ రాజగృహంలో ఉంటున్నాడని చెప్పారు. ఇద్దరికీ పెద్ద తేడా లేదని పేర్కొన్నారు. అక్టోబర్ 7న యూదులకు వ్యతిరేకంగా దాడి చేశారని.. ఇప్పుడు పహల్గామ్‌లో హిందువులకు వ్యతిరేకంగా దాడి చేశారని రూబిన్ గుర్తుచేశారు. అప్పటికీ.. ఇప్పటికీ పెద్ద తేడా లేదని.. ఇజ్రాయెల్‌పై జరిగినట్లుగానే.. భారత్‌పై జరిగిందని పేర్కొన్నారు. హమాస్‌పై ఐడీఎఫ్ దళాలు ఎలా దాడి శాయో.. ఇప్పుడే అదే మాదిరిగా భారత్ కూడా చేయాల్సిందేనన్నారు. ఐఎస్ఐను పూర్తిగా భారత్ నాశనం చేయాలని కోరారు. హహల్గామ్‌లో మంగళవారం జరిగిన మారణహోమంలో మొత్తం 28 మంది చనిపోగా.. 60 మందికి పైగా గాయపడ్డారు. మృతదేహాలను అధికారులు స్వస్థలాలకు తరలించారు. ఉగ్రవాదులు ఆర్మీ దుస్తుల్లో రావడంతో పర్యాటకులు గుర్తించలేకపో యారు. దీంతోనే భారీ నష్టం జరిగిపోయింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకుల పై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటన ను భారత్ సహా యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. అప్పుడు అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత పర్యటనలో ఉన్నప్పుడు కశ్మీర్‌లో ఇలాంటి దాడే జరిగింది. మళ్లీ ఇప్పుడు అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తుండగా పహల్గాంలో ముష్కరులు నరమేధానికి పాల్పడ్డారు. ఈ దాడిపై పాక్ స్పందిస్తూ తమకు సంబంధం లేదని, స్థానికులే ఈ ఘోరానికి పాల్పడ్డారని నిందిస్తోంది. ఇలాంటి నాటకాలు ఎన్ని ఆడినా.. ఆ దేశ వక్ర బుద్ధి ఎలాంటిదో అందరికీ తెలుసు. పహల్గాం దాడికి మనం చేయాల్సింది ఒక్కటే..! పాక్ ను ఉగ్రవాద ప్రేరేపిత దేశంగా, మునీర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించాలని మైఖెల్ రూబిన్ అన్నారు. పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ రెచ్చగొట్టే ప్రసంగం తర్వాతే ఈ దాడి జరగడంతో వేళ్లన్నీ ఆయనవైపే చూపిస్తున్నాయి. అసీం మునీర్‌కు.. భారత్‌పై తీవ్రమైన ద్వేషంతో ఉంటాడన్న పేరుంది. ఆయన ప్రకటనలూ ఉగ్ర దాడికి పురిగొల్పేలానే ఉంటాయి.

## పాక్‌కు తిరిగి చేరుకుంటున్న పౌరులు

ఇస్లామాబాద్, పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ పూర్తి యుద్ధానికి బదులుగా, విస్తృత ఉగ్రవాద దాడిని ప్లాన్ చేస్తోందని ఆరోపించారు.మా సమాచారం ప్రకారం, భారతదేశం పూర్తి యుద్ధానికి బదులుగా పాకిస్తాన్ అంతటా విస్తృత ఉగ్రవాద దాడులను ప్లాన్ చేస్తోంది. ఆ ఉగ్రవాద దాడుల్ని తిప్పికొట్టేందుకు మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాము. అయితే, అలా జరిగితే, అది ప్రతిఫలంగా ఉంటుంది. పాక్ పౌరులు సురక్షితంగా లేకుంటే, వారిపై దాడి జరిగితే, భారత పౌరులు సురక్షితంగా ఉండరు. భారత్ చేసిన దాడి కారణంగా ఒక్క పాకిస్తాన్ పౌరుడు మరణించినా, భారతదేశం భారీ మూల్యం చెల్లించేలా చేస్తాం అని ఆసిఫ్ అన్నారు. పాకిస్తాన్ తన సార్వభౌమాధికారం, భద్రతకు ఏదైనా ముప్పు కలిగితే దృఢమైన ప్రతిస్పందన ఎదుర్కొంటారని భారత్‌కి వార్నింగ్ ఇచ్చింది. భారత్ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి పహల్గామ్ వంటి సంఘటనల్ని వాడుకుంటుందని పాకిస్తాన్ జాతీయ భద్రతా కమిటీ- సమావేశం తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది. సింధు జలాల ఒప్పందం రద్దుని యుద్ధ చర్యగా పాకిస్తాన్ అభివర్ణించింది. పహల్గామ్ ఉగ్ర దాడి జరిగిన తర్వాత పాకిస్తాన్ లోలోపల భయపడుతూనే, భారత ప్రతీకారాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎల్ఓసీ వద్ద పాకిస్తాన్ తన సైన్యాన్ని మోహరించింది. పాక్ ప్రధాని షెహజాబ్ షరీఫ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. దీని తర్వాత, భారత్‌పై ప్రతీకార చర్యలకు పాల్పడింది. భారత విమానాలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేయడంతో పాటు- ద్వైపాక్షిక ఒప్పందాలను నిలిపేస్తున్నట్లు, వాణిజ్యాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉంటే,భారత్‌లో పర్యటిస్తున్న అనేక మంది పాకిస్థాన్ జాతీయులు పంజాబ్‌లోని అటారీ వాఘా సరిహద్దు గుండా తమ దేశానికి తిరుగు ప్రయాణమయ్యారు. పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్న తర్వాత సార్క్ వీసా పథకం ద్వారా భారత్‌లో పర్యటిస్తున్న పాక్ వాసుల్ని 48 గంటల్లోగా తిరిగి తమ దేశానికి వెళ్లిపోవాలని కేంద్ర ప్రభుత్వం కోరిన విషయం తెలిసిందే. దీంతో వివిధ కారణాల దృష్ట్యా భారత్‌లో పర్యటిస్తున్న పాక్ జాతీయుల్లో కొందరు గురువారం అటారీ-వాఘా సరిహద్దు గుండా వెనక్కు వెళ్లిపోయారు. తమ బంధువులను కలుసుకునేందుకు 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చామని, ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కరాచీకి చెందిన ఓ కుటుంబం తెలిపింది. కేంద్ర ఆదేశాల మేరకు బుధవారం అధికారులు అటారీ- వాఘా సరిహద్దును మూసివేశారు.

## ఎడారి అవ్వతుందా?

న్యూఢిల్లీ,భారత్-పాక్ మధ్య దాదాపు 65 ఏళ్లుగా ఓ ఒప్పందం నడుస్తోంది. దీన్ని ఇప్పటివరకు ఎవ్వరూ కెలకలేదు. టచ్ చేయాలని కూడా అనుకోలేదు. అదే సింధు నదీ జలాల ఒప్పందం. సింధు నదితో పాటు మిగతా 5 నదుల జలాల పంపిణీకి సంబంధించిన కీలక ఒప్పందం ఇది.ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో ఏర్పాటైన ఈ ఒప్పందం ఇన్నాళ్లూ సజావుగా అమలవుతూ వస్తోంది. రెండు దేశాల మధ్య ఎన్ని ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా, యుద్ధాలు జరిగినా ఈ ఒప్పందానికి తూట్లు పొడిచేలా భారత్ ఎప్పుడూ వ్యవహరించలేదు. దీనికి కారణం ఒకే ఒక్కటి, అదే మానవతా దృక్పథం. ఈ ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘించిందంటే పాకిస్థాన్ కొన్నేళ్లకు ఎడారిగా మారిపోతుంది. భారత్ పై నుంచి పాక్ కు వెళ్లే నదులివి. పాకిస్థాన్ వ్యవసాయ రంగానికి, తాగునీటికి కీలకమైన ఈ నదుల ప్రవాహాన్ని భారత్ అడ్డుకోకూడదనేది ఒప్పందం. అందుకే ఇప్పటివరకు ఈ నదులుపై ఎలాంటి ఆనకట్టలు నిర్మించలేదు భారత్. నదీ ప్రవాహాన్ని అడ్డుకుంటే, పాక్ కు నీటి సరఫరా తగ్గిపోతుంది. ఫలితంగా అక్కడ వ్యవసాయ భూమి బీడుగా మారుతుంది. ఇప్పుడు పహల్గాం ఘటనతో భారత్ ఈ కీలకమైన ఒప్పందం నుంచి బయటకు వచ్చేసింది. సింధు నదీ జలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ) నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో రాబోయే రోజుల్లో ఈ నదీ జలాల్ని భారత్ ఎలాగైనా వాడుకోవచ్చు. అవసరమైతే ఆనకట్టలు కట్టుకోవచ్చు. ఇప్పటికే ఉన్న ఆనకట్టల నుంచి కావాలంటే నీటిని కిందకు వదిలేయొచ్చు, లేదంటే ఆపుకోవచ్చు. ఈ రెండింటిలో ఏది చేసినా నష్టమే. పంట చేతికొచ్చే టైమ్ కు నీటిని వదిలితే పంటలన్నీ నాశనం అవుతాయి. నీరు కావాల్సిన టైమ్ లో ఆపితే పాక్ గొంతెండిపోతుంది. ఇలా పాక్ ను ఇరకాటంలో పెట్టేసింది భారత్. ఇప్పటికే పాక్ లో భూగర్భ జలాలు అడుగంటాయి. ఇలాంటి టైమ్ లో ఒప్పందం అమలవ్వకపోతే, 15 ఏళ్లలో పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ మొత్తం బీడుగా మారుతుందంటున్నారు విశ్లేషకులు. అయితే ట్రీటీ నుంచి తప్పుకున్నంత మాత్రాన, ఇప్పటికిప్పుడు పాకిస్థాన్

# పహల్గాం దాడి వెనుక హమాస్ హస్తం ఉందా..



న్యూఢిల్లీ,జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రదాడికి కారణంగా 26 మంది మరణించారు. అయితే గతేడాది ఇజ్రాయెల్‌లో జరిగిన హమాస్ తరహాలో ఈ దాడి జరిగిందని నిఘా వర్గాలు ఈ సందర్భంగా పేర్కొంటున్నాయి. ఈ తరహా దాడులతో భారతదేశాన్ని అస్థిర పరచడమే కాకుండా ఇతర దేశాలను సైతం ఆవిధంగా చేస్తున్నాయని తెలిపాయి. ఈ దాడిలో నలుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారని.. వారిలో ఇద్దరు పాకిస్థానీయులు కాగా.. మరో ఇద్దరు జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వారని పేర్కొన్నాయి. వీరంతా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో శిక్షణ పొందారని వెల్లడించాయి. వీరికి పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ వెన్ను దన్నుగా ఉన్న లష్కరే తోయిబాతోపాటు జైషే మహమ్మద్ సంస్థలు శిక్షణ ఇచ్చాయన్నాయని వివరించాయి. పాకిస్థాన్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 5వ తేదీన హమాస్ నాయకులు ఆ దేశానికి వెళ్ళారని నిఘా వర్గాలు తెలిపాయి. అక్కడ నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు తీసుకు వెళ్లారని చెప్పాయి. ఈ సందర్భంగా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలకు చెందిన కమాండర్లతో ఈ హమాస్ నాయకులు సమావేశవమయ్యారని తెలిపాయి. ఈ హమాస్ నాయకుల పర్యటన సందర్భంగా రావాలాకోట్‌లో ఓ ర్యాలీ సైతం నిర్వహించారని వెల్లడించాయి. ఈ సందర్భంగా ఉగ్రవాద సంస్థలకు చెందిన పలువురు కీలక నాయకులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇంకా చెప్పాలంటే.. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ సోదరుడు తల్హా సైఫ్, లాంచ్ కమాండర్ అస్గర్ ఖాన్ కాశ్మీరీ, మసూద్ ఇలియాస్‌తోపాటు పలువురు లష్కరే తోయిబా కమాండర్లు సైతం దీనికి హాజరయ్యారని నిఘా వర్గాలు ఈ సందర్భంగా వివరించాయి. గత ఏడాది అక్టోబర్ 7న వచ్చిన మరో నిఘా సమాచారం ప్రకారం.. భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద కార్యకలాపాలను ప్రేరేపించే లక్ష్యంతో ఇలాంటి రాడికల్ భావజాలాన్ని నాటే ప్రయత్నం కోసం హమాస్ నాయకులను పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఢాకా తీసుకు వెళ్లిందని సమాచారం. అల్ ఖైదాతో ప్రత్యక్ష సంబంధాలున్న ప్రముఖ తీవ్రవాది ముఫ్తీ షాహిదుల్ ఇస్లాం స్థాపించిన ఇస్లామిస్ట్ సంస్థ 'అల్ మర్కజుల్ ఇస్లామి' ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలుస్తోంది.

1999లో ఖుల్నాలోని అహ్మదియా మసీదుపై బాంబు దాడికి కుట్ర పన్నినందుకుగాను ముఫ్తీ షాహిదుల్లా ఇస్లాంను అరెస్టు చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది మరణించారు. ఆ తర్వాత అతడు విడుదలై.. ఆఫ్ఘనిస్తాన్,పాకిస్తాన్‌తోపాటు ఆఫ్రికా వెళ్లాడు. అక్కడ అల్ ఖైదాకు చెందిన వ్యక్తుల వద్ద పేలుడు పదార్థాల శిక్షణ పొందాడు. అయితే అతడు 2023లో మరణించాడు. కానీ జమాతుల్ ముజాహిదీన్ బంగ్లాదేశ్ (%జీవీడీ%) వంటి తీవ్రవాద సంస్థలు షాహిదుల్ ఇస్లాంను ఇప్పటికీ ఆరాధిస్తునే ఉన్నాయి. గతేడాది ఢాకాలో అక్టోబర్‌లో జరిగిన కార్యక్రమానికి సీనియర్ హమాస్ నాయకులు షేక్ ఖలీద్ కుదుమితోపాటు పొలిటికల్ బ్యూరో చైర్మన్ షేక్ ఖలీద్ మిషాల్ హాజరయ్యారు. ఇతర ప్రముఖ హాజరైన వారిలో పాకిస్తాన్‌కు చెందిన షేఖుల్ ఇస్లాం ముఫ్తీ తకీ ఉస్మానీ, మౌలానా ఫజ్లూర్ రెహమాన్ ఉన్నారు. వీరిద్దరు రాడికల్ వర్గాలలో ప్రముఖులుగా ప్రసిద్ధి పొందారు. మరోవైపు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోన్న పాకిస్థాన్‌ను దౌత్యపరంగా, ఆర్థికంగా ఏకాకి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. అందుకోసం సైనిక ప్రణాళికలు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మద్దతు పెరుగుతోంది. పాకిస్తాన్‌ను దౌత్యపరంగా , ఆర్థికంగా ఒంటరిగా చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక రకాల చర్యలు తీసుకుంది. మరోవైపు భారతదేశంతో సంఘీభావం ప్రకటించిన మొదటి దేశాలలో ఇజ్రాయెల్ ఒకటి – హమాస్ చేతిలో నష్టపోయిన దేశం కూడా ఇజ్రాయెల్ కావడం గమనార్హం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీహార్‌లో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగించిన వెంటనే ఈ మద్దతు లభించింది. ఇజ్రాయెల్ మద్దతు ఉమ్మడి ఉగ్రవాద ముప్పుకు వ్యతిరేకంగా రెండు దేశాల మధ్య ఐక్యత యొక్క దృఢమైన సందేశంగా భావించబడింది.

# సరిహద్దుల్లో భారత జవాన్‌ను బంధించిన పాక్

న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడి ఘటనతో భారత్-పాక్ మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. భారత జవానును పాకిస్తాన్ బందీగా చేసుకుంది. భారత్, పాక్ సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ జవాన్‌ను పాక్ బంధించింది. తమ భూభాగంలోకి ప్రవేశించాడని పాక్ ఆరోపించింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను అక్రమంగా బంధించడంపై భారత్ మండిపడింది. బుధవారం ఫిరోజ్‌పూర్ బోర్డర్ దగ్గర 182వ బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పీకే సింగ్ ప్రమాదవశాత్తూ బోర్డర్ దాటాడు. పాకిస్తాన్ రేంజర్లు బీఎస్ఎఫ్ జవాన్ పీకే సింగ్ ను బంధించారు. ఆ సమయంలో పీకే సింగ్ బీఎస్ఎఫ్ యూనిఫాం ధరించి సర్వీస్ రైఫిల్‌తో ఉన్నారు. సరిహద్దు అవతల పొలం పనులు చేసుకుంటున్న రైతులకు తోడుగా ఉన్న పీకే సింగ్ ఒక చెట్టు కింద నీడలో కూర్చుని ఉండగా పాక్ రేంజర్లు ఆయనను బంధించారు. పీకే సింగ్ నిర్బంధంపై సరిహద్దులోని భద్రతా దళాల మధ్య సమావేశం కొనసాగుతోంది. బీఎస్ఎఫ్ జవానును తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని భారత్ స్పష్టం చేసింది. పహల్గాం ఘటన తర్వాత జరిగిన పరిణామాలతో భారత జవాను నిర్బంధం చర్చనీయాంశమైంది. ఏప్రిల్ 23న సాయంత్రం జవానును పాక్ నిర్బంధించింది.

# పీవోకే స్వాధీనం సాధ్యమేనా? అఖండ భారత్‌కు ఎదురవుతున్న సవాళ్లు ఇవే!




న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడి తర్వాత యావత్ భారత్ చేస్తున్న డిమాండ్ ఒక్కటే. పాకిస్తాన్ పని పట్టాల్సిందే. మళ్లీ సర్జికల్ స్ట్రైక్స్ చేయాల్సిందే. పీవోకే స్వాధీనం చేసుకోవాల్సిందే. అఖండ భారత్‌ను ఆవిష్కరించాల్సిందే. హిందువులంతా ముక్తకంఠంతో నినదిస్తున్నారు. పాక్‌ను దెబ్బకొట్టాలంటే.. పీవోకే ను భారత్ తిరిగి ఆక్రమించుకోవాలని కోరుతున్నారు. మరి ఇది సాధ్యమేనా? పీవోకే మనదేనా? అఖండ భారత్‌ను మోదీ పునః స్థాపితం చేస్తారా? చరిత్రలో పీవోకే పై అసలేం జరిగింది? రాజకీయ, సైనిక కారణాలు ఎలా ఉన్నాయి?

పీవోకే ఎవరిది?

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ 13వేల కిలోమీటర్ల వైశాల్యం ఉన్న భూభాగం. ఎక్కువ భాగం కొండలు, పర్వతాలే. 40 లక్షల పైచిలుకు జనాభా. అంతా ముస్లింలే. ఒకప్పుడు కశ్మీర్‌లో భాగంగా ఉండేది. అఖండ భారత్‌లో అంతర్భాగమనేది మన వాదన. ఇప్పుడు పాక్ ఆక్రమిత కశ్మీర్‌గా ఉంది. అలాగని అదేమీ పాకిస్తాన్‌కు చెందింది కాదు. కానీ, పాక్ కంట్రోల్‌లోనే ఉన్న ప్రాంతం. చాలా కాంప్లికేషన్స్ ఉన్నాయి పీవోకే చుట్టూ.

1947-48 ఇండో పాక్ వార్ :

దేశ విభజన జరిగిన తర్వాత.. కశ్మీర్ స్వతంత్ర రాజ్యంగా ఉండేది. జమ్మూ కశ్మీర్‌పై కన్నుపడిన పాకిస్తాన్.. గిరిజనులను కశ్మీర్ రాజు హరిసింగ్ మీదకు ఉసిగొల్పింది. గిరిజనుల ముసుగులో పాక్ సైన్యం తిరుగబాటుకు ప్రాతినిధ్యం వహించింది. ఆ దాడిని ఎదుర్కోలేని రాజా హరిసింగ్.. అప్పటి భారత ప్రభుత్వం సాయం కోరారు. కశ్మీర్‌ను ఇండియాలో విలీనం చేస్తేనే సహాయం చేయగలమని భారత ప్రభుత్వం తెలిపింది. అలా 1947 అక్టోబర్ 26న కశ్మీర్ భారతదేశంలో విలీనమైంది. జమ్మూకశ్మీర్ రక్షణ, విదేశీ, కమ్యూనికేషన్ల నియంత్రణ ఇండియా చేతిలోకి వచ్చింది. వెంటనే భారత సైన్యం కశ్మీర్ రాజుకు సపోర్ట్‌గా రంగంలోకి దిగింది. అటునుంచి పాకిస్తాన్ నేరుగా యుద్ధంలో దిగింది. ఇరు దేశాల మధ్య వార్ జరిగింది. సమస్య పరిష్కారానికి ఐక్యరాజ్య సమితి సాయం కోరింది ఇండియా. కశ్మీర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించారు. కానీ, అది ఆచరణ సాధ్యం కాలేదు. 1949లో కాల్పుల విరమణ ఒప్పందం జరిగినా.. అప్పటికే కశ్మీర్‌లోని కొంత భూభాగంలోకి చొచ్చుకొచ్చిన పాకిస్తాన్ తిరిగి వెనక్కి వెళ్లలేదు. ఆ ప్రాంతమే పీవోకే.. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌గా మిగిలిపోయింది. అది ఇండియాదే అనేది భారత ప్రభుత్వ వాదన. 1971లో మరోసారి ఇండో పాక్ యుద్ధం జరిగింది. 1972లో సిమ్లా ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం కశ్మీర్ సమస్యతో సహా ద్వైపాక్షికంగా వివాదాలను పరిష్కరించడానికి ఇరుదేశాలు అంగీకరించాయి. కానీ, పీవోకే పై ఇప్పటికీ క్లారిటీ రాలేదు.

పీవోకే స్వాధీనం సాధ్యమేనా?

హిమాలయాలు, పిర్ పంజాల్ శ్రేణులతో ఉన్న కఠినమైన పర్వతాలతో కూడిన భూభాగంలో పీవోకే ఉంది. శీతాకాలంలో మొత్తం మంచుతో కప్పబడి ఉ ంటుంది. సైనికులను పంపించి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడం భారత్‌కు సవాళ్లతో కూడిన సాహసమే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులే ఉన్న కార్గిల్ వార్ సమయంలో మన సైన్యానికి తీరని నష్టమే చేసిందని గుర్తు చేస్తున్నారు. ఒకవేళ మనం పీవోకే పై దాడి చేసినా.. పాక్ చూస్తూ ఊరుకుంటుందని అనుకోలేం. అది కూడా యుద్ధానికి దిగుతుంది. ఇప్పటికే పీవోకేలో పాకిస్తాన్ భారీ ఎత్తున ఆర్మీని మోహరించింది. శాశ్వత సైనిక స్థావరాలను ఏర్పాటు చేసింది. ఇండియాకే ఆ ప్రాంతంపై సరైన పట్టు లేదు. పీవోకేలో యుద్ధమే జరిగితే భారీ డ్యామేజ్ తప్పకపోవచ్చు. రెండూ అణ్వాయుధ దేశాలే కావడం మరింత ప్రమాదకరమైన అంశం.

పీవోకేలో చైనా చొరబాటు

అటు, చైనా సైతం పీవోకే లో మెల్లిమెల్లిగా చొరబడింది. చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ (%జూజుజ%) రూపంలో %ూశీఖ%లో చైనా పెట్టుబడులు పెడుతోంది. ఇండియా ఆ ప్రాంతంలో ఎంటర్ అయితే.. పాక్‌కు సపోర్ట్‌గా చైనా జోక్యం చేసుకునే ఛాన్సెస్ ఎక్కువే ఉన్నాయి. అది మరో సమస్యకు తెరలేపుతుంది.

పీవోకేపై భారత్ వ్యూహం ఇదే..

భారత ప్రభుత్వం దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, టెక్నాలజీ తదితర అంశాల మీదే ఎక్కువ ఫోకస్ పెడుతోంది. %ూశీఖ%ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఇప్పటి వరకైతే ఎలాంటి ప్రయత్నాలు చేసింది లేదు. యుద్ధం వల్ల కలిగే ఆర్థిక, ప్రాణ నష్టాలను దృష్టిలో పెట్టుకొని.. పీవోకే ను అంతగా పట్టించుకోవట్లేదనే చెప్పాలి. ఆ ప్రాంతంపై నేరుగా దాడి చేయడం తరహా చర్యల కంటే కూడా.. అవసరమైన సమయాల్లో.. 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ వైమానిక దాడుల వంటి పరిమిత సైనిక చర్యలనే ఎంచుకుంది ఇండియా. అయితే, వ్యూహాత్మకంగా వేచి చూసే ధోరణి అవలంభిస్తోందని విశ్లేషిస్తున్నారు రాజకీయ నిపుణులు. ఇప్పటికే పీవోకే ప్రజలు పాకిస్తాన్ పాలనపై ఆగ్రహంగా ఉన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నామని మండిపడుతు న్నారు. తాము ఇండియాలో కలుస్తామంటూ అప్పుడప్పుడూ ఉద్యమాలు కూడా చేస్తున్నారు. వాటిని పాక్ సర్కారు అణిచివేస్తూ వస్తోంది. ఎప్పటికైనా ఆ ఉ ద్యమాలు తిరుగుబాటుగా మారుతాయని.. అప్పుడు సరైన సమయంలో భారత్ తగు విధంగా జోక్యం చేసుకునేలా పరిస్థితులు అనుకూలిస్తాయని చెబుతున్నారు. అందుకే, ఇప్పుడే కాకపోయినా.. ఎప్పటికైనా పీవోకే మనదే అవొచ్చు. అఖండ భారత్ అసాధ్యమేమీ కాకపోవచ్చు. హోప్ ఫర్ ద బెస్ట్.

# కాందహార్ హైజాక్ నుంచి క్రమంగా దాడులు



న్యూఢిల్లీ,కాందహార్ విమానం హైజాక్ ఘటనను ఏ భారతీయుడు మరచిపోడు. నేపాల్ వెళ్లిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేయించి, జైలు నుంచి విడుదలయిన ఉగ్రవాదులంతా పాక్‌లోనే ఉన్నారు. వారే తదుపరి అనేక టెరరర్ దాడులకు మూలకారుకులు. ముంబై మారణకాండ లాంటి ఘటనలకు కారకుడైన హఫీజ్ సయీద్.. టెర్రరిస్టులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి పోషిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. గత కొంతకాలంగా ఈ టెర్రరిస్టు బృందం కశ్మీర్ లోయలో క్రియాశీలకంగా ఉన్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. గతేడాది సోనమార్గ్, బూతాపత్రీ, గందేర్బల్ దాడుల్లో ఈ బృందమే పాలు పంచుకుంది. గత అక్టోబర్‌లో బూతాపత్రిలో జరిగిన దాడిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు సహా మొత్తం నలుగురు మృతి చెందారు. అదే నెలలో సోనామార్గ్ టెన్నెల్ కార్మికులను టార్గెట్ చేస్తూ జరిగిన దాడిలో ఆరుగురు కార్మికులతో పాటు ఓ డాక్టర్ కూడా కన్నుమూశారు. అయితే, గత డిసెంబర్‌లో ఈ టెర్రరిస్టు బృందానికి చెందిన జునైద్ అహ్మద్ భట్ అనే లష్కర్ ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుపెట్టాయి. మిగిలిన వారు ఎలాగోలా తప్పించుకుని, సమీప అడవుల్లోకి పారిపోయారు. భారీ దాడి చేశాక ఈ ఉగ్రమూకలు అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోతాయని నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాకిస్థానీ హ్యాండర్ల నుంచి తదుపరి ఆదేశాలు అందే వరకూ అక్కడి అడవుల్లోనే తలదాచుకుంటారని తెలిపాయి. తాజా దాడిలో పాల్గొన్న ఊగ్రవాదులు ఎల్ఈటీ చీఫ్ హఫీజ్ సయీద్‌తో పాటు అతడి ముఖ్య అనుచరుడు నియంత్రణలోని వారే అని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. వీరికి పాక్ మిలిటరీతో పాటు-ఐఎస్ఐ నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అంది ఉండొచ్చని అనుమానిస్తున్నాయి. బైసరన్ లోయలో మూడు ప్రాంతాలను టార్గెట్ చేసుకున్న ఉగ్రమూకలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. పోలీసుల కథనాల ప్రకారం, ఓ ప్రాంతంలో ఐదు మందిని, మరో మైదాన ప్రాంతంలో ఇద్దరిని, లోయ సరిహద్దు వద్ద మిగతా వారిని ఉగ్రవాదులు బలి తీసుకున్నారు. ఫెన్సింగ్ దాటి పారిపోగలిగిన వారు ఈ దాడి నుంచి తప్పించుకోగలిగారు. మరోవైపు, దాడికి పాల్పడిన వారి రేఖాచిత్రాలను జమ్మూ కశ్మీర్ పోలీసులు విడుదల చేశారు. వీరిలో ఇద్దరు పాకిస్థానీలు కాగా మరొకరు స్థానిక అనంత్‌నాగ్ జిల్లా వాస్తవ్యుడు. నిందితుల ఆచూకీ చెప్పిన వారికి రూ. 20 లక్షల నజరానాను కూడా పోలీసులు ప్రకటించారు. సమీప అడవుల్లో ఉగ్రవాదులు తలదాచుకున్న స్థావరాలను గురువారం భద్రతా దళాలు గుర్తించాయి. వారి జాడ కనిపెట్టేందుకు భద్రతా దళాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు అలుముకుంటున్నాయి. భౌతికమైన దాడులే కాకుండా పాక్ గుండెను దెబ్బతీసేలా చర్యలకు భారత్ పూనుకుంది. సింధునదీ జలాల నిలిపివేత ఇందులో ప్రధానమైనదని చెప్పాలి. ఎందుకంటే జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. లష్కరే తోయిబా అనుబంధ ఉగ్రసంస్థ టీఆర్ఎఫ్ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది టూరిస్టుల మరణించారు. దీంతో ప్రజలు పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అరేబియా సముద్రంలోకి భారత నేవీ ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రవేశించింది. ఇది ప్రస్తుతం పాకిస్తాన్ దిశలో ఉంది. భారత నేవీ సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఖచ్చితంగా ఛేదించే పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించింది. ఇదిలా ఉంటే, మరోవైపు భారత వైమానిక దళం తన కీలకమైన సైనిక విన్యాసాలను చేపట్టింది. ఎక్సర్సైజ్ ఆక్రమన్ పేరు భారీ ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. గురువారం సెంట్రల్ సెక్టార్‌లో పెద్ద ఎత్తన వార్ గేమ్ ఎక్సర్సైజ్ నిర్వహించింది. పర్వతాలు, భూతల లక్ష్యాలను దాడి చేసే సామర్థ్యాలపై దృష్టి పెట్టింది. ఈ ఎక్సర్సైజ్‌లో రాఫెల్ యుద్ధ వివానాలు పాల్గొన్నాయి. ఇందులో లాంగ్ రేంజ్ దాడులు, శత్రు స్థావరాలపైన దాడుల వంటి వాటిని నిర్వహిం చాయి. వైమానిక దళాని చెందిన కీలక ఆస్తులు పలు వైమానిక స్థావరాల నుంచి తూర్పు వైపుగా తరలించినట్లు- తెలుస్తోంది. పంజాబ్ అంబాలాలో, పశ్చిమ బెంగాల్ హాషిమారాలో వైమానిక దళం రెండు రాఫెల్ స్క్వాడ్రన్లను మోహరించింది.

# ఇందిరను ఆదర్శంగా తీసుకోవాలి.. ఉగ్రమూకలకు గట్టి జవాబివ్వాలి

హైదరాబాద్,ఉగ్రవాద దాడుల్ని తిప్పికొట్టే క్రమంలో వారికి గట్టి జవాబిచ్చేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. 1967, 1971 లో జరిగిన సంఘటనలను ఆయన గుర్తు చేశారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఉగ్రమూకలకు ధీటైన జవాబివ్వాలని ఆయన కేంద్రానికి పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతీ చర్యకు మద్దతు పలికేందుకు అందరం సిద్ధంగా ఉ న్నామని వివరించారు.

దుర్గామాత ఇందిర..

"1967, 1971లో కూడా పాకిస్తాన్ భారత్ పై కవ్వింపు చర్యలకు పాల్పడింది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ వారిగి గట్టి జవాబిచ్చారు. ఒక్క దెబ్బతో పాకిస్తాన్ ను పాకిస్తాన్, బంగ్లాదేశ్ అనే రెండు ముక్కలు చేశారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని ప్రతిపక్ష నేత వాజ్ పేయ్ దుర్గామాతతో పోల్చారు." అని గుర్తు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రధాని మోదీ దుర్గామాత భక్తులుఅని, ఆయన ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఇందిర లాగా ఉ గ్రవాదులకు గట్టి జవాబివ్వాలన్నారు. ఈ పోరాటంలో కోట్లాది భారతీయులంతా కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉంటారని, ఒక్క దెబ్బతో పాకిస్తాన్ ను రెండు ముక్కలు చేయాలని కోరారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను భారత్ లో కలపాలన్నారు.పహల్గాం ఉగ్రదాడుల్ని కాంగ్రెస్ పార్టీ నేతలు ముక్త కంఠంతో ఖండించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. హైదరాబాద్ లో పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా సీఎం రేవంత్ వెంట నడిచారు. ఈ ర్యాలీకి ఎంఐఎం నేతలు, సామాన్యులు కూడా తరలి వచ్చారు. కొవ్వొత్తులు వెలిగించి



ర్యాలీ చేపట్టారు. పహల్గాం బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. అనంతరం ఇందిరాగాంధీ విగ్రహం ముందు కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం ప్రకటించారు. సెల్ ఫోన్ లైట్లు వెలిగించి పాకిస్తాన్ కుట్రలను తిప్పికొడతామని నినాదాలు చేశారు.దేశం ప్రశాంతంగా ఉన్న వేళ.. ఉగ్రవాదుల దాడి అందర్నీ కలచి వేసిందని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పహల్గాంలో భారత పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడులను ఖండిస్తున్నామని చెప్పారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిం చాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. అందరూ ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని, ఆ కుటుంబాలకు అందరం అండగా నిలబడి మనోధైర్యాన్ని ఇవ్వాలని చెప్పారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోడానికి అందరం కృషి చేయాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. క్లిష్ట సమయాల్లో దేశ పౌరులంతా ఒకే తాటిపైకి రావాలని దేశం కోసం అందరం కలసి కట్టుగా పోరాడాలన్నారు.

# పాకిస్తానీలు వెంటనే మీ దేశానికి వెళ్లండి: తెలంగాణ డీజీపీ



హైదరాబాద్: పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం? పాకిస్తానీయులు వీసా రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. పాకిస్తాన్ కు చెందిన వారు వెంటనే తమ రాష్ట్రాలను వీడి స్వదేశానికి వెళ్లిపోవాల్సిందేనని ప్రభుత్వాలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. దీనిలో భాగంగా తెలంగాణ డీజీపీ జితేందర్.. రాష్ట్రంలో ఉన్న పాకిస్తానీయులు వెంటనే స్వదేశీ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలి. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవు. మెడికల్ వీసాల మీద ఉన్నవారికీ ఏప్రిల్ 29 వరకు మాత్రమే గడువు ఉంది. పాకిస్తానీలు తమ దేశానికి అటారి బార్డర్ నుండి వెళ్లొచ్చు. ఈనెల 30 వరకు అటారి బార్డర్ తెరుచుకుని ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పాకిస్తానీలు తమ దేశానికి వెళ్లిపోవాలి. ఒకవేళ అక్రమంగా తెలంగాణలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటాం' అని డీజీపీ జితేందర్ హెచ్చరించారు.కాగా, భారత్‌లోని పాక్ పౌరులకు కేంద్ర మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. దేశంలో ఉన్న పాక్ దేశస్తులు భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని సూచించింది. జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ఉందని, సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశంపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ తీసుకున్న ఐదు సంచలన నిర్ణయాల అమలుకు భారత్ వడివడిగా అడుగువేస్తోంది. వేగంగా చర్యలు తీసుకునే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం పాక్ పౌరులకు జారీ చేసిన అన్నీ వీసాలను భారత్ రద్దు చేసింది. వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది.

# పహల్‌గావ్ ఉగ్రదాడికి బలైన స్థానిక యువకుడు ఆదిల్ హుస్సేన్

జమ్ము కశ్మీర్: "నేను నా కుమారుడి గురించి, అతడు చేసిన షహాదత్ (త్యాగం) కారణంగా గర్వపడుతున్నాను. ఆ గర్వం వల్లనే నేను బతికి ఉన్నాను. లేకపోతే నా కుమారుడి నిర్జీవ శరీరాన్ని చూసిన క్షణంలోనే చనిపోయేవాడిని" - ఈ మాటలు అన్నది పహల్‌గావ్‌కు చెందిన సయ్యద్ హైదర్ షా. మంగళవారం నాటి ముష్కరమూక దాడిలో తన పెద్ద కుమారుడిని ఆయన కోల్పోయారు. కుటుంబ పోషకుడిగా ఉన్న కొడుకు ఉగ్రవాదుల తూటాలకు బలైపోవడంతో హైదర్ షా కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. ఇంతటి విషాదంలోనూ కొడుకు చేసిన త్యాగాన్ని హైదర్ షా పదేపదే తలచుకుంటున్నారు.జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్‌గావ్ బైసరన్ లోయలో మంగళవారం మధ్యాహ్నం పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన మెరుపుదాడిలో 27 మంది అమాయకులు అసువులు బాశారు. అయితే తన కళ్లెదుటే పర్యాటకులను చంపుతుంటే హైదర్ షా కొడుకు సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా చూస్తూ ఉండలేకపోయాడు. ఉగ్రవాదులను ఎదిరించి టూరిస్టుల ప్రాణాలు కాపాడాలనుకున్నాడు. కానీ ముష్కరుల తుపాకీ తూటాలకు అడ్డుగా నిలబడి ప్రాణాలు కోల్పోయాడు.రోజూ మాదిరిగానే ఆదిల్ ఆ రోజు ఉదయం పనికి వెళ్లాడు. పర్యాటకులను గుర్రంపై ఎక్కించుకుని తీసుకెళ్లడం అతడి పని. అయితే ఉగ్రదాడి జరిగిన వెంటనే మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆదిల్ కుటుంబానికి ఈ వార్త తెలిసింది. వెంటనే వారు ఆదిల్ ఫోన్ చేశారు. ఎన్నిసార్లు చేసినా ఫోన్ ఎత్తకపోవడంతో వారు భయాందోళనతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి ఆస్పత్రికి పరుగులు పెట్టారు. తన కుమారుడికి బుల్లెట్ గాయాల య్యాయని తెలిసి హైదర్ షా హతాశులయ్యారు. "సాయంత్రం 6 గంటల ప్రాంతంలో నా కుమారుడు ఆసుపత్రిలో ఉన్నాడని మాకు తెలిసింది. అతడి కోసం వెతుకుతున్న వ్యక్తులు ఈ సంఘటన గురించి నాకు సమాచారం అందిం చారు" అని హైదర్ గుర్తుచేసుకున్నారు. తన కొడుకు కొంతమంది ప్రాణాలు కాపాడి చనిపోయినందుకు గర్వపడుతున్నానని ఆయన ఏఎన్ఐతో చెప్పారు.

మాకు దిక్కెవరు?

తమ ఇంటికి మూలస్తంభంగా నిలిచిన కొడుకు అనూహ్యంగా చనిపోవడంతో ఆదిల్ తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది. ఇప్పుడు తమను ఎవరు పోషిస్తారని అంటూ రోదిస్తోంది. "నా కుమారుడు రోజుకు 300 రూపాయిలు సంపాదించేవాడు. అతడు తెచ్చిన డబ్బులతో సాయంత్రం బియ్యం కొని, వంట చేసుకుని కలిసి తినేవాళ్లం. ఇప్పుడు మాకు ఎవరు ఆహారం తెస్తారు? ఎవరు మందులు తెస్తారు?" అంటూ ఆదిల్ తల్లి కన్నీరుమున్నీరవుతోంది. పర్యాటకులను రక్షించే క్రమంలో తన కొడుకు ప్రాణాలు ఫణంగా పెట్టాడని, వారు కూడా


సయ్యద్ హైదర్ షా కుటుంబ సభ్యులు

మన సోదరులేనని అంటూ ఆమె మానవత్వాన్ని చాటారు.

శాశ్వతంగా సెలవు..

ఇంటికి త్వరగా వచ్చేస్తానని వెళ్లి ఉగ్రదాడికి ఆదిల్ బలైపోయాడని ఆదిల్ సోదరి రవిసా ఆవేదన చెందింది. "తనకు ఆరోగ్యం బాలేదు. ఒక రోజు సెలవు తీసుకుంటానని చెప్పాడు. త్వరగా వచ్చేస్తానని పనికి వెళ్లాడు. కానీ అతడు తిరిగి రాలేదు. ఉగ్రవాదుల నుంచి తుపాకీని లాక్కొని టూరిస్టులను కాపాడటానికి ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయాడు. ఛాతీలో మూడు, గొంతులో ఒక బుల్లెట్ దిగింద"ని రవిసా రోదించింది.

అండగా ఉంటామన్న అబ్దుల్లా

పర్యాటకులను రక్షించేందుకు తన ప్రాణాలను ఫణంగా పెట్టిన ఆదిల్‌ను స్థానికులు రియల్ హీరోగా కొనియాడారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా ఇదే విధంగా స్పందించారు. స్వయంగా ఆదిల్ ఇంటికి వెళ్లి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదిల్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసాయిచ్చారు.

## పిఎస్ఆర్‌కు మూడ్రోజుల పోలీస్ కస్టడీ

అమరావతి,ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు కస్టడీ పిటిషన్‌పై విజయవాడ కోర్టులో విచారణ జరిగింది. ఆయన్ను వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి అనుమతించింది. ఆది, సోమ, మంగళవారాల్లో సీఐడీ అధికారులు ఆయన్ను కస్టడీకి తీసుకున్నారు. ఉ దయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించనున్నారు. న్యాయవాదుల సమక్షంలో విచారణ చేయాలని కోర్టు ఆదేశించింది.

# ఉగ్రవాదం వేరు ముస్లిం సమాజం వేరు: పవన్



జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు అశువులు బాసిన సంగతి తెలిసిందే. పర్యాటకులుగా కశ్మీర్ లోయలో అడుగుపెట్టిన ఆ 26 మందిని ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా తూటాలతో కాల్చి చంపారు. హిందువులను మాత్రమే ఎంచుకొని ఉగ్రవాదులు కాల్పులు జరిపారని, ముస్లింలను వదిలేశారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈ క్రమంలోనే కొన్ని ప్రాంతాల్లో హిందూ, ముస్లిం వర్గాల మధ్య సున్నితమైన వాతావరణం ఏర్పడింది. టెర్రరిస్టులుగా మారిన అతివాద ముస్లింలు చేసిన దుశ్చర్య ప్రభావం మొత్తం ముస్లిం సమాజంపై పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఆ తరహా సున్నితమైన చర్చలు, విమర్శలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం వేరు%తా%ఉగ్రవాదులు వేరు..మామూలు ముస్లిం సమాజం వేరు అని పవన్ కల్యాణ్ అన్నారు. సమాజంలో శాంతియుతంగా ఉండే, శాంతి భద్రతలు కోరుకునే ముస్లిం సమాజం వేరు అని పవన్ అన్నారు. అంతేకాదు, కొందరు ఉగ్రవాదుల చర్యల వల్ల మొత్తం ముస్లిం సమాజాన్ని నిందించడం సరైనది కాదని, ఆ స్పష్టత తమందరికి ఉందని, ఎన్డీఏ ప్రభుత్వానికి ఉందని పవన్ స్పష్టం చేశారు.అయితే, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాల్సిందేనని పవన్ చెప్పిన సంగతి తెలిసిందే. చిన్న పిల్లల ముందు తండ్రిని చంపేశారని, శాడిస్టిక్ గా, ఒక పద్ధతి ప్రకారం అమాయకులను ఉగ్రవాదులు చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దారుణ ఘటనను భారత దేశం ఎప్పటికీ మరిచిపోదని చెప్పారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరేయాలని, మనకు కనికరం ఎక్కువైపోయిందని, మంచితనం ఎక్కువైందని పవన్ అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com